## క్లుప్తంగా

### దోషులను కఠినంగా శిక్షించాలి

**మల్కాపురం:** కోల్‌కతా ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. వైద్యురాలి మృతికి సంఘీభావంగా భాష్యం పాఠశాల విద్యార్థులు శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు బుధవారం ఉదయం ర్యాలీ చేపట్టారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

### సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా నిరసన



మల్కాపురంలో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

**మల్కాపురం:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపు మేరకు బుధవారం భారత్ బంద్ నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు దళిత సంఘాల ప్రతినిధులు రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మల్కాపురం సెంటర్ వద్ద పారిశ్రామిక ప్రాంత మాలలు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ గుడాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దళితరత్న మాటూరి చిన్నారావు, పులారి లక్షణరావు, ముద్దాడ శంకర్‌రావు, సువారి సురేష్, ములకా అజయ్ తదితరులు పాల్గొని కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### గురుకుల ప్రవేశాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంకర్ మిథినేష్‌ను సత్కరిస్తున్న మండల విద్యా శాఖాధికారులు

**మద్దిలపాలెం:** గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ విద్యార్థి సీహెచ్.మిథినేష్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో మిథినేష్‌ను సీతమ్మధార మండల విద్యా శాఖాధికారి-1 రామారావు, విద్యా శాఖాధికారి-2 బాలామణి ఘనంగా సత్కరించారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 6వ తరగతిలో ప్రవేశానికి మిథినేష్ పరీక్ష రాసి జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమని విద్యా శాఖాధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు అభినందించారు.

### ఇసుక నిల్వలపై సెబ్ తనిఖీలు



ఇసుక నిల్వలు తనిఖీ చేస్తున్న సెబ్ అధికారులు

**సీతమ్మధార :** సీతమ్మధార స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వలను బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు పర్యవేక్షణలో సీతమ్మధార, భానునగర్, మద్దిలపాలెం, తాటిచెట్లపాలెం, రామాటాకీస్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో గల ఇసుక నిల్వలను తనిఖీ చేశారు. అనుమానిత ప్రాంతాల్లో ఇటుక, కాంక్రీట్, రాయి విక్రయిస్తున్న స్టాక్ పాయింట్ల వద్ద తనిఖీలు చేశారు. ఎక్కడా అక్రమంగా ఇసుక నిల్వలు లభించలేదని ఇన్‌స్పెక్టర్ వెంకటప్పలనాయుడు మీడియాకు తెలిపారు. ఎవరైనా ఇసుక అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ ఎస్.ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

# చాపకింద నీరులా..!

- కరాసలో బయటపడ్డ లెప్రసీ కేసు
- వైద్య ఆరోగ్యశాఖ హై అలెర్ట్
- వ్యాధి తీవ్రతపై ఇంటింటి సర్వే
- ఆందోళనలో ప్రజానీకం

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డు కరాసలో కుష్టు (లెప్రసీ) కేసు బయటపడింది. చాలా కాలం తర్వాత కుష్టు కేసు రావడంతో చాప కింద నీరు మళ్లీ విస్తరిస్తుందని ఆందోళన చెందుతున్నారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అలెర్ట్ అయ్యారు. అంటువ్యాధి కావడంతో దీని ప్రభావం ఏ మేరకు ఉందనే దానిపై సమగ్ర పరిశీలనకు సిద్ధమయ్యారు. జిల్లా క్షయవ్యాధి నివారణ విభాగం ఆధ్వర్యంలో సచివాలయం యూనిట్‌గా ఇంటింటి సర్వే చేస్తున్నారు. సచివాలయ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను టీమ్‌గా ఏర్పాటు చేసి ప్రతీ ఇంటిని సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. శరీరంపై ఎక్కడైనా మచ్చలు ఉంటే అలాంటి వారి వివరాలను వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కరాసలో వ్యాధి సోకిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వారికి తగిన వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటిని జల్లెడపడుతున్న వైద్య సిబ్బంది లెప్రసీ కేసు వెలుగులోకి రావడంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంకా వ్యాధి గ్రస్తులు ఎవరైనా ఉన్నారా అనేది తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. కరాసతో పాటు, నగరంలోని మరో ముగ్గురికి లెప్రసీ సోకినట్లు తేలింది. జిల్లా వ్యాప్తంగా చేస్తున్న ఇంటింటి సర్వేలో 3 వేల మంది అనుమానితులను గుర్తించి, వారి చర్మ నమూనాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరో ఐదు రోజులు పాటు ఇంటింటి సర్వే కొనసాగనుంది.



జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో ఇంటింటి సర్వే

**కొత్త కేసులు వెలుగులోకి**

క్షయ(టీబీ),కుష్టు(లెప్రసీ) ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన అంటువ్యాధులు. వీటి నివారణ కోసం జిల్లా క్షయ నివారణ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో హోదా గల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యల ఫలితంగా టీబీ కేసులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. కానీ తాజాగా టీబీ, లెప్రసీ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం వైద్య సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేలో నలుగురుకు లెప్రసీ సోకినట్లు నిర్ధారించగా, వీరిలో కరాస ఏరియాకు చెందిన వ్యక్తి ఉన్నారు.

**ప్రత్యేక శ్రద్ధతో సర్వే చేస్తున్నాం**

టీబీ, లెప్రసీ వ్యాధులను నియంత్రించేలా క్షేత్రస్థాయిలో పని చేస్తున్న వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. లెప్రసీ కేసులు గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తున్నాం. సర్వే మరో వారంలో పూర్తవుతుంది. ఎంతమందికి లెప్రసీ సోకిందనే వాస్తవ గణాంకాలు తెలుస్తాయి. బాధితులకు సత్వర వైద్యం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–డాక్టర్ పూర్ణేందర్ బాబు, క్షయనివారణ అధికారి

**అంటువ్యాధుల విజృంభనతో ఆందోళన**

డెంగ్యూ జ్వరాలకు తోడు టీబీ, లెప్రసీ వంటి అంటువ్యాధులు సైతం వ్యాప్తి చెందుతుండడంతో నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 80 మంది వరకు లెప్రసీ వ్యాధి గ్రస్తులు ఉండగా, తాజాగా చేస్తున్న సర్వేలో మరికొన్ని కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

**కట్టడి చేయకుంటే కష్టమే**

క్షయ, లెప్రసీ వంటి అంటువ్యాధులకు అడ్డుకట్ట వేయకుంటే వీటి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు బయటకు వచ్చే తుంపర్లు, అదే విధంగా పుండ్లు నుంచి కారే చీము, రసి ఇలాంటి అంటువ్యాధుల వ్యాప్తికి కారణం. వ్యాధి సోకిన వ్యక్తులను ముందుగానే గుర్తించి, అలాంటి వారికి ప్రత్యేక వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

**గాజువాకలో కదం తొక్కిన విద్యార్థులు**

**గాజువాక:** మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విద్యార్థులు కదం తొక్కారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి బయల్దేరిన ర్యాలీ సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో యువత వ్యసనాలకు బానిసలుగా మారి అనేక నేరాలకు పాల్పడుతోందన్నారు. మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య విద్యార్థి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రాము, ఎల్‌జీ నాయుడు, నాయకులు సాయి, గుణ, కుసుమ, మౌని, అజయ్, నిఖిల్, సతీష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

## గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సబ్బవరం:** సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో నేరుగా కళాశాలకు వచ్చి ఈ నెల 22న అందజేయాలన్నారు. కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్యా వారి ఆదేశాల మేరకు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీ కోర్సుల్లో 50 శాతానికి పైగా మార్కులు సాధించాలని చెప్పారు. జనరల్ సబ్జెక్టుల్లో కామర్స్ విభాగంలో ఒక పోస్టు, పౌరశాస్త్ర విభాగంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో మెకానికల్, ఆటో మొబైల్ టెక్నీషియన్‌లో ఒక పోస్టు, ఫిజియోథెరపీలో ఒక పోస్టు, కంప్యూటర్ సైన్స్, టెక్నీషియన్‌లో ఒక పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## ఉపాధి అవకాశాలు వినియోగించుకోండి

**పరవాడ:** యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా సూచించారు. సంస్థ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సీఐపీఈటీ, విజయవాడ) సహకారంతో 4వ బ్యాచ్ స్కిల్ డెవలప్‌మెంట్ విజయోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సిన్హా మాట్లాడుతూ సీఎస్సార్ కార్యక్రమాల ద్వారా సమాజ సంక్షేమానికి సింహాద్రి ఎన్టీపీసీ విశేష కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, వివిధ సంస్థల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంస్థ పాటుపడుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఒక్కో బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులకు 6 నెలల పాటు మెషిన్ ఆపరేటర్స్-ఇంజెక్షన్ మోల్డింగ్, మెషిన్ ఆపరేటర్స్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సిన్హా చెప్పారు. కార్యక్రమంలో సీజీఎం(సీపీజీ-3) ఆర్.ఆర్.పరిధా, జీఎం నోవాహు గడ్డం, సంస్థ అధికారులు పద్మప్రియ, అనిత్‌కుమార్, శ్రీమంత మహాపాత్ర, కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, డాక్టర్ సిహెచ్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న యువతతో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సిన్హా, అధికారులు

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**సబ్బవరం:** మండలంలోని వంగలి గ్రామంలో ఒక వ్యక్తి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. వంగలికి చెందిన యర్రా రాఘవరావు(32)కు పదేళ్ల కిందట అనకాపల్లి మండలం సింహాద్రిపురానికి చెందిన వసుదతో వివాహం జరిగింది. వారికి జశ్వంత్(7), కౌశిక్(3) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు 6 నెలల క్రితం వరకూ తన అత్తగారి గ్రామానికి సమీపంలోని చేనుల అగ్రహారానికి చెందిన ఒక వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన రాఘవరావు విపరీతమైన అప్పులు చేసేశాడు. ఇవన్నీ భరించలేక అతడి భార్య రెండేళ్ల కిందట పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి స్వగ్రామంలో ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక భార్య, పిల్లలు తన వద్దకు రాకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాడు. మనస్తాపంతో మంగళవారం వారి పశువుల పాకలో రాఘవరావు ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి పశువుల పాకలో కుమారుడి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మృతుడి తండ్రి కొండబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.

## ‘కూటమి’ తీరుతో భవన నిర్మాణ కార్మికులు కుదేలు

**పెందుర్తి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణ కార్మికుల పనులకు గండి పడి వారి జీవితాలు కుదేలవుతున్నాయని ఏఐటీయూసీ నేత ఆర్.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీకి నిరసనగా బుధవారం చినముషిడివాడ కూడలి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ వల్ల సామాన్యుల కంటే దళారులు బాగుపడుతున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక కదా అని సామాన్యులు రీచ్‌కు వెళితే రెండు మూడు రోజుల పాటు అక్కడే వేచి ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇసుకను ఉచితంగా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ముత్యమాంబ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు వై.రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

## ‘ఆరెంజ్’ బస్సులో 63 బీర్లు స్వాధీనం

**సీతమ్మధార :** తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి విశాఖకు అక్రమంగా బీర్లు తరలిస్తుండగా ద్వారకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కి చెందిన నరేంద్రబాబు ‘ఆరెంజ్’ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో అక్రమంగా 63 టిన్ను బీర్లను విశాఖకు రవాణా చేశాడు. రామాటాకీస్ వద్ద ద్వారకా పోలీసులు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో డ్రైవర్ క్రాంతికుమార్ (34) వద్ద 63 టిన్ను బీర్లను స్వాధీనం చేసుకున్నారు. బస్సు వెనుక ఒక కారులో నరేంద్రబాబు విశాఖ వచ్చాడని పోలీసులు తెలిపారు. ద్వారకా సీఐ ఎస్.రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హ్యాండ్ బాల్ పోటీల విజేతలకు అభినందనలు

**సీతమ్మధార :** సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. సత్యసాయి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు కదిరి పట్టణంలో నిర్వహించారు. అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో బుల్లయ్య డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎల్.వెంకటేష్, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆర్.నిఖిల్ విశాఖ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈ మేరకు రేసపువానిపాలెంలో గల కళాశాలలో బుధవారం వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## 61వ వార్డులో కుక్కల బెడద

**మల్కాపురం:** జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో శునకాల బెడద ఎక్కువైంది. ఇవి ఆ మార్గాల్లో వచ్చే పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు కర్రలు పట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డు పరిధిలో మల్కాపురం,గాంధీజీవీధి,ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో వీధి కుక్కల బెడద పెరిగింది. ఇవి అటుగా వచ్చే వారిపై ఒక్కసారిగా దాడికి పాల్పడుతున్నాయి. బుధవారం ఉదయం మల్కాపురం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై శ్రీహరిపురం వెళ్లడానికి సిద్ధమయ్యాడు. ఆ వ్యక్తిని నాలుగు వీధి కుక్కలు వెంబడించాయి. భయంతో వాహనాన్ని అక్కడ విడిచి దగ్గరలోని ఇంట్లోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అలాగే గాంధీజీవీధి ప్రాంతంలో 8 ఏళ్ల చిన్నారి గత వారం ట్యూషన్ నుంచి రాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా వీధి కుక్కలు ఆ చిన్నారిపై దాడి చేసే యత్నం చేశాయి.అక్కడ వారు చూసి తరిమి వేయడంతో ఆ చిన్నారి క్షేమంగా బయటపడింది. వీధి కుక్కల సమస్యపై అధికారులు స్పందించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



ద్విచక్ర వాహనం చుట్టూ చేరిన వీధి కుక్కలు

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

**అగనంపూడి:** ఉపాధ్యాయుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. లంకెలపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరించేందుకు తనవద్ద ప్రణాళిక ఉందన్నారు. ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను కూడా సూచించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు రాణి, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**పెదగంట్యాడ:** గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటి వరకూ గ్రౌండ్ కాని గృహాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పెదగంట్యాడ మండలం నడుపూరులోని 160 ఎకరాల్లో చేపట్టిన గృహాల లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ పురోగతి ఉండాలని.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నడుపూరు లేఅవుట్‌లో 6216 గృహాలను మంజూరు చేయగా 408 ఇళ్ల పనులు ఇప్పటి వరకూ చేపట్టకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సత్యనారాయణ, పెదగంట్యాడ మండల తహసీల్దార్ లోకవరపు రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

## ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

**పెదగంట్యాడ:** స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ కార్డుదారుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇప్పటికే సుమారు 7వేల వరకూ నిర్వాసితులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ అధికారులతో చర్చలు జరిపి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డీసీని కలిసిన వారిలో నిర్వాసితుల సంఘం నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి పులి అప్పలరెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు ఉన్నారు.



స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఆర్థిక ఆంక్షలు విధిస్తే అంగీకరించబోం

**స్పష్టం చేసిన ఉక్కు కార్మిక సంఘాల నేతలు**

**ఉక్కునగరం:** కార్మికులపై ఆర్థిక ఆంక్షలు విధించాలని చూస్తే అంగీకరించబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో పర్యటించి కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుత ప్లాంట్ పరిస్థితిని కార్మికులకు వివరించారు. యాజమాన్యం ముడి పదార్థాలు ఏర్పాటు చేయలేక కార్మికులపై ఆంక్షలు విధిస్తుందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాలు ప్లాంట్ పూర్తి ఉత్పత్తి తీయకుండా అడ్డుకుంటున్నాయని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో యాజమాన్యం నడిపితే కచ్చితంగా లాభాలు సాధిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలన్నారు. ఈ డిమాండ్లపై గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, నరేష్‌కుమార్, సురేష్‌బాబు, కొమ్ము ప్రసాద్, పి.వి. రమణమూర్తి, బి. డేవిడ్, బి. అప్పారావు, వై.టి. దాస్, కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, మంత్రి గోపినారాయణ పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

## రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సమీక్షించాలి

**విశాఖ సిటీ:** ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని, దీనిపై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయాలని మాల జాయింట్ యాక్షన్ పోరాట కమిటీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ఉద్యమకారులు బుధవారం ఏయూ స్కూల్స్‌ను మూయించారు. యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అవుట్ గేట్ వద్ద ఉన్న షాపులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు డాక్టర్ బోరుగడ్డ మోహన్ బాబు మాట్లాడుతూ వర్గీకరణపై తీర్పు దేశ పార్లమెంటరీ వ్యవస్థకు, రాజ్యాంగానికి పెనుముప్పుగా పరిణమిస్తుందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆర్థిక పరమైన అంశాలను జోడించి క్రిమిలేయర్ తీసుకురావడం రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలా ఉందని ఆరోపించారు. దీన్ని ప్రతి ఒక్క భారతీయుడు వ్యతిరేకించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను, క్రిమిలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అర్జున్, ప్రొఫెసర్ సుబ్బారావు, ప్రొఫెసర్ సిద్ధయ్య, ప్రొఫెసర్ మునిస్వామి, ఆరేటి మహేష్, డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సుధీర్ పాల్, ఎస్సీ, ఎస్టీ, బీసీప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.